క్లుప్తంగా

సిటిజన్ సర్వే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు

బాడంగి: సిటిజన్ సర్వే పూర్తి చేయండి అని ఎంపీడీవో ఆంజనేయులు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సోమవారం సమీక్షించారు. ప్రస్తుతం చేపడుతున్న కులగణన సర్వేతోనే సిటిజన్ సర్వేను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని తెలిపారు. మండలంలో మొత్తం 15,600 కుటుంబాలు ఉండగా, సోమవారం నాటికి 13,932 కుటుంబాల ఇళ్ల వరకు సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన ఇళ్ల కుటుంబాల వివరాల సర్వేను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న శ్యామలరావు, తదితరులు

తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీలను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాడంగి, తెర్లాం యూనిట్ అధ్యక్షులు యడ్ల శ్యామలరావు, ఉద్యోగులు, సంఘ నాయకులు, సభ్యులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిల్లా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం రూపొందించిన క్యాలెండర్, డైరీలను, గుర్తింపుకార్డులను ఉద్యోగులకు పంపిణీ చేశారు. బాడంగి, తెర్లాం తాలూకా యూనిట్ బలోపేతానికి కృషి చేస్తున్న పీఆర్ మినిస్టీరియల్ సంఘం జిల్లా అధ్యక్షులు సీహెచ్ మురళి, కార్యదర్శి రాంబాబు, జెడ్పీ చైర్మన్ సీసీ సురేష్‌లకు బాడంగి, తెర్లాం తాలూకా యూనిట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ సంఘం కోశాధికారి వై.వేణునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌వాష్ మెషీన్ ప్రారంభం



హ్యాండ్‌వాష్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: స్థానిక పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద హ్యాండ్‌వాష్ మెషీన్‌ను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం ప్రారంభించారు. కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, ప్రజలు, సిబ్బందికి ఈ మెషీన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు మాట్లాడుతూ మెప్మా మెషీన్ డైరెక్టర్ ఈ హ్యాండ్‌వాష్ మెషీన్ కమ్ ట్యాంక్‌ను అందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, గుంటుముక్కల సప్తగిరి, మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

హౌస్ రిజిస్ట్రేషన్ చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు

రాజాం సిటీ: సచివాలయాల వారీగా జగనన్న కాలనీల్లోని లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించి, హౌస్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వార్డు సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలతో సోమవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ఆ దిశగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.

ఉపాధి వేతనదారుకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావు

మెంటాడ: మండల కేంద్రంలోని అనంత సాగరం చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో వేతనదారు విసినిగిరి అప్పారావుకు గాయాలయ్యాయి. సోమవారం పనుల్లో భాగంగా చెరువు గట్టుపై ఉన్న తుప్పలను ఆయన తొలగిస్తుండగా, అదే స్థలంలో వేరొకరి చేతిలో ఉన్న కత్తి జారి, అప్పారావు తలను బలంగా తాకింది. దీంతో అతడి తలకు గాయం కాగా, వైద్యసేవల నిమిత్తం మెంటాడ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అప్పారావు ఆరోగ్యం నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: స్వయం సహాయక సంఘాల అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక రామకృష్ణ థియేటర్ ఆవరణలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే డ్వాక్రా(స్వయం సహాయ సంఘం) గ్రూపు మహిళలను ఉద్దేశించి, కాసేపు ప్రసంగించారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో తాను అధికారంలోకి రాగానే నాలుగు విడతల్లో డ్వాక్రా అక్కచెల్లెమ్మల బ్యాంక్ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఇచ్చిన హామీని తూ.చ తప్పకుండా సీఎం జగనన్న నెరవేర్చారన్నారు. నాలుగు విడతల్లో రాష్ట్రంలోని ప్రతీ మహిళ పేరున బ్యాంక్‌లో ఉన్న రుణం మాఫీ చేసి, ఇచ్చిన మాటలను నిలబెట్టుకున్నారన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో 4,432 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వీటిలో 53,184 మంది సభ్యులు ఉండగా, నాలుగో విడత ఆసరా పథకం కింద రూ.70.85 కోట్లు చెల్లించారన్నారు. ఒక్క తెర్లాం మండలంలో 1,142 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.5.89 కోట్ల రుణాలను చెల్లించడం జరిగిందన్నారు. ప్రతీ మహిళ ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నదే సీఎం జగన్ ధ్యేయమని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం డ్వాక్రా గ్రూపు మహిళలకు ఆసరా చెక్కు నమూనాను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు గర్బాపు లూర్దు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మాదాసు శేషగిరి, మండల పార్టీ సీనియర్ నాయకులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్బాపు రామారావు, బోను అప్పలనాయుడు, మర్రాపు జగన్నాథం, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, వెలుగు ఏపీడీ సావిత్రి, ఏసీ చిరంజీవి, ఏపీఎం మోహన్, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

జిల్లా స్థాయిలోనూ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఉజ్వల భవిత అందివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందన్నారు. ఆటలో గెలుపోటములు సహజమని, పోరాటపటిమ కనబరచాలన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులంతా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో క్రికెట్‌లో పురుషుల విభాగంలో రామభద్రపురం జట్టు, మహిళల విభాగంలో రామభద్రపురం మండలంలోని జన్నివలస జట్టు గెలుపొందగా, కబడ్డీలో పురుషుల విభాగంలో తెర్లాం మండలంలోని పనుకువలస జట్టు, మహిళల విభాగంలో రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జట్టు, ఖోఖో పోటీల్లో పురుషుల విభాగంలో బొబ్బిలి మండలంలోని పారాది జట్టు, మహిళల విభాగంలో రామభద్రపురం మండలంలోని ఆరికతోట జట్టు, వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో తెర్లాం మండలంలోని విజయరాంపురం జట్టు, మహిళల విభాగంలో బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడిపేట జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, టీపీఆర్‌వో జగన్మోహనరావు, ఎంపీడీవో పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగేంద్రనాథ్ మండల్ జయంతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సంఘం వీధిలో మహాప్రాణ్ జోగేంద్రనాథ్ మండల్113వ జయంతి సోమవారం నిర్వహించారు. అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై, జోగేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల జనోద్ధరణకు జోగేంద్రనాథ్ పాటుపడ్డారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని, ఉత్తమ జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ పీపీ మజ్జి జగన్నాథం, న్యాయవాది విల్సన్ బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమరానికి సమాయత్తం కావాలి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: త్వరలో జరగబోయే ఎన్నికల సమరానికి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులంతా సమాయత్తం కావాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ మండల కార్యాలయంలో పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సోమవారం సమావేశమైన ఎమ్మెల్యే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును ప్రతీ ఇంటికి వివరించాలన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలపాలన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని, ఆ దిశగా పార్టీ శ్రేణులంతా హాజరుకావాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ మంచి చేశారని, వారంతా సీఎం జగనన్నను, ఆయన పార్టీని మళ్లీ ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల కన్వీనర్ అప్పికొండ లక్ష్మణనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ఎస్ఐగా దేవి

మెంటాడ: ఆంధ్ర ఎస్ఐగా దేవి నియమితులైనట్టు ప్రస్తుత ఎస్ఐ గణేష్ సోమవారం తెలిపారు. ఇదే విషయమై ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను జిల్లా కేంద్రంలోని డీఆర్‌బీకి బదిలీ చేశారని, విశాఖపట్నం వీఆర్ నుంచి దేవిని ఇక్కడ ఎస్ఐగా నియమించారని పేర్కొన్నారు. మంగళవారం ఆమె విధుల్లో చేరుతారన్నారు.

20 మద్యంసీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంబాటిళ్లను చూపిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని రెడ్డిపేట జంక్షన్ వద్ద ఓ కిరాణా షాపులో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యంసీసాలను సోమవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, సదరు విక్రేతపై కేసు నమోదు చేశామన్నారు.

నవదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1.58 లక్షలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గమ్మ వారి ఆలయ హుండీ ఆదాయం సోమవారం లెక్కించామని ఈవో శివకేశవరావు తెలిపారు. ధర్మవరం దేవాదాయ శాఖ ఈవో బి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో హుండీలు తెరిచామని, 85 రోజులకు గాను రూ.1,58,493లు సమకూరాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, అర్చకులు రామాయణం శ్రీనివాసరావుశర్మ, పర్యవేక్షకులు కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

రేగిడి: జీవామృతంతో చీడపీడల నివారణ సాధ్యమని ఏవో జి.మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం ట్రైనీ మాస్టర్ రమాదేవి అన్నారు. మండలంలోని సోమరాజుపేటలో కోట్ల నారాయణరావు ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభిస్తూ పండిస్తున్న వరి పంటను వారు సోమవారం పరిశీలించారు. అనంతరం జీవామృతం తయారీ, దానిని పంటలపై పిచికారీ చేసే విధానం, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ట్రైనీ మాస్టర్ కిరణ్, ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



వెంకంపేట పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచి, శుచి తప్పనిసరిగా కలిగి ఉండేలా చూడాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వెంకంపేట, తునివాడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం సందర్శించిన ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, ఉపాధ్యాయుల విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు చేయాలని, వంటకాలు రుచికరంగా ఉండాలన్నారు. చదువులో వెనబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై దృష్టిసారించాలని సిబ్బందికి తెలిపారు.

ఒత్తిడి జయిస్తేనే ఉత్తమ ఫలితాలు

- డిప్యూటీ డీఈవో పి.బ్రహ్మాజీరావు



విద్యార్థులతో కలిసి ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావు

బాడంగి: పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి, ప్రధాని మోదీ సోమవారం ప్రసంగించారు. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి డిప్యూటీ డీఈవో పి.బ్రహ్మాజీరావు సోమవారం వీక్షించారు. అనంతరం డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థుల్లో నెలకొన్న ఒత్తిడిని జయిస్తేనే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రధాని చెప్పినట్లుగా విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని కలిగి ఉండాలని, పరీక్షలకు సంసిద్ధులు కావాలన్నారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రుచి, శుచితో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందివ్వాలని, అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సిబ్బందికి సూచించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని, అందుకు తగినట్లు ప్రణాళిక వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



ఎంపీటీసీ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావుతో పాటు అతడి సోదరుడు గణపతిరావునాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పరామర్శించారు. ఎంపీటీసీ తల్లి మజ్జి సత్తెమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామానికి వెళ్లి, సత్తెమ్మ మృతి పట్ల సంతాపం తెలిపి, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్‌లు బుడుమూరు పట్టాభి, కరణం శ్రీనివాసరావు, కరణం గోవిందరావు, ఎంపీటీసీ రెడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూమి పట్టాలు ఇవ్వాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

మెంటాడ: మండలంలోని గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి, భూమి పట్టాలు ఇవ్వాలని మండల గిరిజన సంఘం నాయకుడు తామరాపల్లి సోములు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గిరిజనులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టిన ఆయన మండల వ్యాప్తంగా చాలామంది గిరిజనులు తమకు దగ్గరలోని భూములను సాగుచేసుకుని జీవిస్తున్నారని, వారికి ఆ భూములపై శాశ్వత హక్కు కల్పించేలా పట్టాలు అందివ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్



పేపర్ ప్లేట్‌ల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక పట్టణంలోని మల్లిఖార్జునకాలనీలో మెప్మా టీఎల్‌ఎఫ్(టౌన్ లెవల్ ఫెడరేషన్) సహకారంతో పట్టణ ప్రగతి యూనిట్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ తయారీ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఇక్కడి వార్డుకు చెందిన మెహర్ మనీ సంఘం ద్వారా ఎ.కృష్ణవేణి అనే సభ్యురాలు రూ.2.60 లక్షల వ్యయంతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారని, ఇందులో రూ.40 వేల సబ్సిడీ ఉంటుందన్నారు. మహిళల అభ్యున్నతికి ఈ తరహా రాయితీలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు, మెప్మా టీఎంసీ ఎస్వీ రత్నం, టీఎల్‌ఎఫ్ ఓబీ ఎం.సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హిందీ నేర్చుకుంటే ఎన్నో ప్రయోజనాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

రాజాం: జాతీయ భాష హిందీ నేర్చుకుంటే ఎన్నో ప్రయోజనాలు అని ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన హిందీ ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధ్రువపత్రాలు(సర్టిఫికెట్లు) సోమవారం అందజేశారు. హిందీ పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థులకు హిందీ భాషపై మక్కువను పెంచుతున్న హిందీ ప్రచారక్ కె.మధుసూధనరావును ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు
- ఇదే సమావేశంలో పీఆర్ జేఈపై సభ్యుల తీవ్ర ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పాలన కొనసాగిస్తుంటే విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని, బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఇదే సమావేశంలో జేఈ తన నివేదికలు వెల్లడిస్తుండగా, పలువురు సభ్యులు లేచి, గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి, ఎం(మెజర్‌మెంట్).బుక్ రికార్డ్ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కార్యాలయానికి ఎప్పుడు వచ్చినా అందుబాటులో ఉండరని, ఫోన్ చేస్తే స్పందించరని జేఈపై మండిపడ్డారు. విధులపై శ్రద్ధ వహించకపోతే సెలవు పెట్టి, వెళ్లిపోండి అంతేగానీ రూ.లక్షలు పెట్టుబడి పెట్టి అభివృద్ధి పనులు చేపడితే వాటికి బిల్లులు చేసేందుకు కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడితే ఎలా అని నిలదీశారు. బిల్లులు చేసేందుకు కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోని అభివృద్ధి పనుల ఎం(మెజర్‌మెంట్).బుక్ రికార్డు సకాలంలో చేయకపోతే ఎలా అని ఎంపీటీసీ సభ్యుడు మండలక తిరుపతిరావు, రావివలస సర్పంచ్ కుమారి ప్రశ్నించారు. తహసీల్దార్ ఎ.సులోచనరాణి తమ నివేదికలు చదువుతూ నవరత్నాల పథకంలో భాగంగా పేదలకు ఇళ్లపట్టాలను ప్రభుత్వం పారదర్శకంగా పంపిణీ చేస్తోందన్నారు. అర్హులుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ చిన్నయ్య తమ నివేదిక చదువుతూ మండలంలో జల్ జీవన్ మిషన్ కింద 13.87 లక్షల వ్యయంతో తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని, పలు గ్రామాల్లో పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ఏవో వెంకటయ్యతో పాటు పలువురు అధికారులు తమ తమ నివేదికలు వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, ఎంపీడీవో రమామణి, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి అరుణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత



ట్రాక్టరులో అక్రమంగా తరలిస్తున్న కలప

బొబ్బిలి: మండల పరిధిలోని రంగరాయపురం కూడలి వద్ద ఓ ట్రాక్టరులో అక్రమంగా తరలిస్తున్న కలపను ఫారెస్ట్ అధికారులు సోమవారం రాత్రి పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. రామభద్రపురం మండలంలోని గొల్లలపేట నుంచి బొబ్బిలి, బాడంగి మండలాల దగ్గరలోని అడ్డదారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఈ కలపను రవాణా చేస్తున్నట్లు సమాచారం అందిందని, ఈ మేరకు తాము ఆకస్మిక తనిఖీలు చేపట్టి, కలపను పట్టుకున్నామని ఫారెస్ట్ అధికారి స్వప్న తెలిపారు. నిందితులకు రూ.50 వేల అపరాధ రుసుం కూడా విధించామన్నారు.

గర్భిణులకు భోజనాలు

రేగిడి: వైద్య తనిఖీల నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం విచ్చేసిన గర్భిణులకు రేగిడి సత్యసాయి భజన మండలి సభ్యులు నారాయణ సేవ పేరిట భోజనాలు పెట్టారు. జల్లు భాస్కరరావు.. ఆయన తండ్రి వెంకటరమణ కుటుంబం పేరిట ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అసిరినాయుడు, వెటర్నరీ వైద్యుడు దుర్గాప్రసాద్, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భావన ఋషికి ప్రత్యేక పూజలు

రాజాం సిటీ: స్థానిక ఈశ్వరనారాయణ కాలనీలో పట్టుశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భావన ఋషికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టుశాలీల కుల దైవమైన భావన ఋషికి ఏటా సంక్రాంతి పండగ తర్వాత పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని సంఘ సభ్యులు తెలిపారు.

